సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



ఈసీ నామినీగా సిద్ధిఖీ

తెలంగాణ యూనివర్సిటీ ఈసీ నామినీగా ప్రొఫెసర్ సిద్ధిఖీని నియమిస్తూ పాలక మండలి నిర్ణయించింది.

- 8లో ▸



త్వరగా నమోదు చేయాలి

గ్యాస్ కనెక్షన్ వివరాలను సంబంధిత యాప్‌లో త్వరగా నమోదు చేయాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.6 /21.6

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల పరిశీలన



సుభాష్‌నగర్ : జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లోగల ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ ఎల్‌సీ) ప్రక్రియ కొనసాగుతోంది. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు పరిశీలన కోసం నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ, గడువులోగా ఎఫ్‌ఎల్‌సీ పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఎన్నికల విభాగం అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంతోష్ తదితరులు ఉన్నారు.

వీడీసీలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

ఖలీల్‌వాడి : గ్రామాభివృద్ధి కమిటీల పేరిట చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి 8 వరకు 5 కేసుల్లో 75 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీడీసీలు గ్రామ అభివృద్ధికి పాటుపడాలని, అనవసర విషయాల్లో తలదూర్చొద్దని సూచించారు. పంచాయతీల పేరిట జరిమానాలు, సాంఘిక బహిష్కరణలు విధిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వీడీసీ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీడీసీలతో ఇబ్బందులకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని, వేతనం రూ.12,500 నుంచి రూ.15,000, ఇతర అలవెన్స్‌లు ఉంటాయన్నారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు అర్హులని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు శివాజీ నగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయానికి బయోడేటా, ఆధార్‌కార్డు, ఫొటోలు, ఇతర సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు 95817 68413, 99487 48428, 99594 56793 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సెమీస్‌కు చేరిన నిఖత్

నిజామాబాద్‌నాగారం : బల్గేరియా దేశంలో జరుగుతున్న అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ సెమీస్‌కు చేరింది. గురువారం ఫ్రాన్సు దేశానికి చెందిన క్రీడాకారిణితో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో 5–0 తేడాతో గెలిచి సెమీస్‌లో అడుగుపెట్టింది. ఈ నెల 10న బల్గేరియా క్రీడాకారిణితో నిఖత్ సెమీస్‌లో తలపడనుంది.

డిప్యుటేషన్లు రద్దు

నిజామాబాద్ నాగారం : జిల్లా వైద్యారోగ్య శాఖలో డిప్యుటేషన్లు రద్దు చేసినట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. వైద్యారోగ్య శాఖ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ ఆదేశాల మేరకు జిల్లాలో డిప్యుటేషన్లపై పని చేస్తున్న వారి ఆర్డర్లు రద్దు చేశామన్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలో 19 మంది, ఇతర జిల్లాల నుంచి మన జిల్లాలో 10 మంది డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 50వరకు ఉద్యోగులు డిప్యుటేషన్లపై పని చేస్తున్నట్లు వివరించారు.

ఉపసంహరించుకోవాలి

వైద్యారోగ్య శాఖలో డిప్యుటేషన్లను రద్దు చేయడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని, తాత్కాలికంగా రద్దును ఉపసంహరించుకోవాలని తెలంగాణ వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. విద్యా సంవత్సరం మధ్యలో రద్దు చేయడంతో పిల్లల చదువులపై ప్రభావం పడుతుందన్నారు. ఉద్యోగుల బదిలీలను చేపట్టాలని డిమాండ్ చేశారు.

దళిత మహిళపై దాడి

సాక్షి, కామారెడ్డి : రామారెడ్డిలో నివాసం ఉంటున్న వేరే గ్రామానికి చెందిన ఓ దళిత మహిళపై కొందరు దాడికి పాల్పడి అమానుషంగా వ్యవహరించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం రాత్రి జరిగిన ఘటనలో ఆమెను దుస్తులు ఊడదీసి చితకబాదారని తెలుస్తోంది. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. రామారెడ్డి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైకోర్టునే తప్పుదోవ..

- తెలంగాణ వర్సిటీ గత వీసీ, ఇద్దరు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ల వ్యవహారం
- యూజీసీ నిబంధనల ఉల్లంఘన
- అడ్డదారిలో పదోన్నతి పొందిన కనకయ్య
- ఈ విషయమై అప్పీలు చేసిన ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి
- అక్రమ వ్యవహారాలను గతంలోనే వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'



'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అనేక అవినీతి అక్రమాలకు, వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచిన నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇప్పటికీ గందరగోళం సద్దుమణగలేదు. రెండున్నరేళ్ల కిందట వర్సిటీలో అక్రమాలకు, వివాదాలకు ఆద్యుడిగా పేరుపొందిన ప్రొఫెసర్ కనకయ్య తాజాగా అడ్డదారిలో పదోన్నతి పొందేందుకు ఏకంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించడం గమనార్హం. దీంతో ఈ వ్యవహారంపై ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి హైకోర్టులో అప్పీలు చేయడం విశేషం.

వివరాల్లోకి వెళితే.. 2021 సెప్టెంబర్‌లో కనకయ్య వివాదాస్పద రీతిలో యూజీసీ/రాష్ట్ర ప్రభుత్వ నియామక నిబంధనలను ఉల్లంఘించి, నోటిఫికేషన్ లేని సీనియర్ ప్రొఫెసర్ పదవికి ఆయనకు ఆయనే పదోన్నతి కల్పించుకున్నారు. అప్పట్లో ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో 2021 అక్టోబర్ 30న వర్సిటీలో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో అక్రమంగా పొందిన పదోన్నతితో పాటు మరికొన్ని వివాదాస్పద నిర్ణయాలను రద్దు చేసి, కనకయ్యకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తీర్మానించారు. అదేవిధంగా కొందరు ప్రొఫెసర్ల సర్వీస్ పుస్తకాలను కనకయ్య అక్రమంగా ఇంటికి తీసుకెళ్లడంపై పోలీసు కేసు పెట్టాలని నిర్ణయించారు. అయితే సదరు అక్రమ ప్రమోషన్ విషయాన్ని అప్పటి వీసీ రవీందర్‌గుప్తాతో కలిసి గోప్యంగా ఉంచి, తన ప్రమోషన్ విషయంపై యూనివర్సిటీ స్పందించడంలేదంటూ కనకయ్య హైకోర్టుకు వెళ్లాడు. అసలు విషయాన్ని కప్పిపుచ్చి న్యాయంగా తనకు పదోన్నతి రావాలని హైకోర్టుకు చెప్పడం విశేషం. ఈ క్రమంలో కోర్టు ఆదేశాలపై అప్పటి రిజిస్ట్రార్ కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించారంటూ కోర్టు ధిక్కారం కేసు సైతం 394/22 నంబరులో నమోదైంది. ఈ మేరకు 2022 ఏప్రిల్ 18న మొదటిసారి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అదే ఏడాది జూలైలో అప్పటి రిజిస్ట్రార్ శివశంకర్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న విద్యావర్ధిని వేతన సవరణ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు హైకోర్టుకు చెప్పడం విశేషం.

■ నోటిఫికేషన్‌లో లేని పోస్టుకు తనకు తానుగా ఇచ్చుకున్న ప్రమోషన్, జీతానికి సంబంధించి పాలకమండలి ఆమోదం లేదు. అదేవిధంగా వరుసగా నియామకమైన ఇద్దరు రిజిస్ట్రార్ల నియామకం సైతం చెల్లదని పాలక మండలి తీర్మానించింది. వాళ్ల హయాంలో జరిగిన అన్ని నిర్ణయాలను రద్దు చేస్తున్నట్లు ఈసీ సభ్యులు తీర్మానంలో పేర్కొన్నారు. అయినప్పటికీ అప్పటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని కోర్టుకు వెళ్లి పాలకమండలి అధికారికంగా తీసుకున్న నిర్ణయాలను దాచిపెట్టి ఆమె సైతం కోర్టును తప్పుదోవ పట్టించడం గమనార్హం. విద్యావర్ధిని ఇచ్చిన వివరణ ప్రకారం వేతన సవరణ చేయాలని, లేనిపక్షంలో కోర్టు ధిక్కారం కింద చర్యలు తీసుకుంటామని మరోసారి 2023 ఏప్రిల్ 9న హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ విషయంలోనూ వర్సిటీ స్పందించకపోవడంతో 2024 జనవరి 8న తుది ఉత్తర్వులు కోర్టు జారీ చేసింది. దీంతో స్పందించిన ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి అప్పటి వీసీ రవీందర్‌గుప్తా, కనకయ్య, విద్యావర్ధినులు కోర్టును తప్పుదోవ పట్టించినట్లు 2024 జనవరి 31న హైకోర్టులో అప్పీలు చేశారు.

14,06,785

జిల్లాలోని మొత్తం ఓటర్లు

- తుది ఓటరు జాబితా విడుదల
- అసెంబ్లీ ఎన్నికల నాటి కంటే పెరిగిన ఓట్లు
- మహిళా ఓటర్లే అధికం



సుభాష్‌నగర్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం తుది ఓటరు జాబితా విడుదల చేసింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు జాబితాను విడుదల చేసి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. జిల్లాలో మొత్తం 14,06,785 మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే 78,237 మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన విషయం తెలిసిందే. జనవరి 22 వరకు జాబితాలో అభ్యంతరాలు, ఓట్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియ కొనసాగింది. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నాటి కంటే 11,799 ఓట్లు పెరిగాయి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోనూ మహిళా ఓట్లే అధికంగా ఉన్నాయి. కాగా ముసాయిదా జాబితాతో పోలిస్తే 1,876 ఓటర్లు పెరిగారు.

మొత్తం 1,549 పోలింగ్ కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా 1,549 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తుది ఓటరు జాబితా ప్రకారం 14,06,785 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 6,64,238 మంది పురుషులు, 7,42,475 మంది మహిళలు, 72 మంది ఇతరులు. మరో 85 (76 పురుషులు, 9 మహిళా) ఎన్‌ఆర్‌ఐ ఓట్లు ఉన్నాయి. జనవరి 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుదిజాబితాను రూపొందించారు.

కొత్త ఓటర్లు11,799

ఆరు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల నాటితో పోలిస్తే ఓట్లు పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలో 13,94,986 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు 14,06,785కి పెరిగింది. అంటే కొత్తగా 11,799 మంది ఓటర్లుగా నమోదయ్యారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేత

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ జాబితాను విడుదల చేసి, వారికి అందజేశారు. ఎస్ఎస్ఆర్– 2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితా రూపొందించామని కలెక్టర్ తెలిపారు. తుది ఓటరు జాబితా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు, తహసీల్దార్, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఓటరు జాబితా విడుదల కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆర్మూర్	217	98,116	1,12,612	6	2,10,734
బోధన్	246	1,05,609	1,15,701	4	2,21,314
బాన్సువాడ	258	93,266	1,02,415	13	1,95,694
నిజామాబాద్‌అర్బన్	289	1,44,645	1,54,961	41	2,99,647
నిజామాబాద్ రూరల్	293	1,18,607	1,35,523	6	2,54,136
బాల్కొండ	246	1,03,995	1,21,263	2	2,25,260
మొత్తం	1,549	6,64,238	7,42,475	72	14,06,785

పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లు
- స్టడీ మెటీరియల్ అందజేత



నగరంలోని ఎస్సీ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులు

జిల్లాలోని హాస్టళ్లలో 'పది' విద్యార్థులు

కమ్యూనిటీ	హాస్టల్స్	విద్యార్థులు
ఎస్సీ	63	402
బీసీ	34	194
ఎస్టీ	03	63

నిజామాబాద్ అర్బన్ : సంక్షేమ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధికారులు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ట్యూటర్లను పెట్టి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలు దగ్గర పడటంతో ఇప్పుడు ప్రత్యేక తరగతులతో పాటు, స్టడీ అవర్లు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రతిరోజు రాత్రివేళ స్టడీ అవర్‌లో విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారు. వారానికి ఒకసారి పరీక్షలు పెడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. హాస్టల్‌లో పెట్టిన పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు గ్రేడింగ్ ఇచ్చి తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం ఇటీవల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల సందేహాలు తీర్చేలా ఆయా సబ్జెక్టుల్లో నిపుణులతో ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేశారు. ప్రేరణ పేరుతో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు ఈ అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. డివిజన్ల వారీగా వసతి గృహ విద్యార్థులను ఒకచోట చేర్చి పరీక్షలంటే భయం పోగొట్టి, మంచి మార్కులు సాధించేలా కృషి చేస్తున్నారు. గతంలో కంటే ఈ సారి మంచి ఫలితాల సాధన కోసం అధికారులు చర్యలు చేపట్టారు.

మెటీరియల్ అందించాం



పదో తరగతిలో మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి విద్యార్థి మీద ప్రత్యేక దృష్టి సారించాం. అవసరమైన మెటీరియల్ అందజేశాం. ఇబ్బందులు లేకుండా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసి మంచి ఫలితాలు సాధిస్తాం.

– శశికళ, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

సన్నద్ధం చేస్తున్నాం



పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రతి రోజు వారి వెంటనే ఉంటున్నాం. ఉదయం, రాత్రి వేళ ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి పరీక్షలు ప్రిపేర్ చేస్తున్నాం. ఈసారి మంచి ఫలితాలు సాధిస్తాం.

– మారుతి, వార్డెన్, డిచ్‌పల్లి హాస్టల్

గల్ఫ్ బోర్డుకు మోక్షం లభించేనా?

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్‌దేశాల్లో ఉపాధి పొందుతున్న వలస కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు, నిధుల కేటాయింపుల అంశం ప్రస్తావిస్తుందా..? అంశంపై వలస కార్మిక కుటుంబాలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాయి. శనివారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో గల్ఫ్ ప్రవాసులకు హామీ ఇచ్చింది. గత నెల 21న సౌది అరేబియాలోని దమామ్‌లో పర్యటించిన ఎన్‌ఆర్‌ఐ మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ వ్యాపారులు, ఉద్యోగులతో చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. మార్చిలో గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని, దీనిపై త్వరలోనే ప్రకటన చేస్తుందని వెల్లడించారు. దీంతో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే గల్ఫ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అందాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2018లో ఎన్‌ఆర్‌ఐ సెల్‌కు అప్పటి ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించినా నిధుల వినియోగానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేయలేదు. ఫలితంగా నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కరోనాలాంటి కఠినమైన పరిస్థితుల వల్ల అనేక మంది ప్రవాసులు గల్ఫ్ దేశాల్లో తమ ఉద్యోగాలను కోల్పోయి ఇంటిబాట పట్టారు. అయినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం ప్రతినిధుల బృందాన్ని కేరళకు పంపినా తర్వాత అడుగులు పడలేదు. కాంగ్రెస్ మొదటి నుంచి వలస కార్మికుల విషయంలో సానుకూలతను వ్యక్తం చేయడంతో వారిలో ఆశలు రేకెత్తాయి. బడ్జెట్‌లో కేటాయింపులపై ఇప్పటికే ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల రావును వలస కార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి విన్నవించారు. మార్చిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గల్ఫ్ దేశాల్లో పర్యటించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



వేణుగోపాల్ రావుకు వినతి పత్రం అందిస్తున్న గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు భీంరెడ్డి

మంచిప్ప గ్రామ శివారులోని కాలువలో సాగవుతున్న వరి



కాలువలో నాట్లు



మంచిప్ప చెరువు అలుగు నుంచి నీళ్లు పారే కాలువలో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కాలువలో నీటిప్రవాహం లేకపోవడంతో రైతులు మంచిప్ప శివారులో నాట్లు వేశారు. కాలువను ఆక్రమించి పంట సాగుచేయడంపై పలువురు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.


–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

వేగంగా సర్వే

- ఎన్‌హెచ్ 63 విస్తరణకు చర్యలు
- రెండు, మూడు రకాల సర్వేలు చేస్తున్న ఏజెన్సీలు
- బైపాస్‌ల నిర్మాణంతో భూములు కోల్పోతామంటున్న రైతులు
- ప్రస్తుత రోడ్డునే విస్తరించాలని డిమాండ్



అధికారితో మాట్లాడుతున్న గాండ్లపేట్ రైతులు



జాతీయ రహదారి విస్తరణ మ్యాప్

మోర్తాడ్(బాల్కొండ): పెర్కిట్ నుంచి మంచిర్యాల్ వరకు జాతీయ రహదారి 63ను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు సర్వే కొనసాగుతున్నది. కొన్ని గ్రామాల్లో ఇళ్లకు నష్టం వాటిల్లుతుందని గుర్తించిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) బైపాస్‌ల నిర్మాణం చేపట్టాలని సూచించింది. బైపాస్‌లను నిర్మిస్తే ఎంతో విలువైన వ్యవసాయ భూములను కోల్పోతామని, ప్రస్తుత రహదారినే విస్తరించాలని రైతులు కోరుతున్నారు. ఆర్మూర్ డివిజన్‌లోని పడకల్, అంక్సాపూర్, మోర్తా డ్, కమ్మర్‌పల్లి శివార్లలో బైపాస్ రోడ్ల నిర్మాణం కో సం 83.895 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్ఏఐ ఇప్పటికే నిర్ధారించగా.. భూ సేకరణ కోసం రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్ ను జారీ చేశారు. మోర్తాడ్‌లో బైపాస్ రోడ్డు నిర్మా ణం అవసరం లేదని, ఇక్కడ జాతీయ రహదారిని విస్తరిస్తే భవనాలకు పెద్దగా నష్టం ఉండదని స్పష్టం చేస్తూ రైతులు ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులకు ఇ ప్పటికే వినతిపత్రం అందజేశారు. అయితే, జాతీ య రహదారి విస్తరణ కోసం రెండు, మూడు రకా ల సర్వే నిర్వహిస్తున్నామని ఏజెన్సీల బృందాలు వెల్లడించాయి.

ఇప్పటికే త్యాగం చేశాం..

గాండ్లపేట్ వద్ద జాతీయ రహదారి మూలమలుపును సరి చేసేందుకు భూమిని సేకరించాల్సి ఉండగా, తమ గ్రామానికి చెందిన రైతుల భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరద కాలువ, రైల్వే లైన్‌ల కోసం విలువైన భూములను త్యాగం చేశామని, జాతీయ రహదారి విస్తరణ, బైపాస్ రోడ్ల నిర్మాణానికి భూములను కోల్పోతే తమకు ఉపాధి కరువవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కడి నుంచి ఎక్కడికి	ఎన్ని కిలోమీటర్లు?	కేంద్ర నిధులు	అవసరమైన భూమి
పెర్కిట్ నుంచి మంచిర్యాల్ వరకు	131.8 కి.మీ.	రూ.2,529 కోట్లు	83.895 హెక్టార్లు

క్లుప్తంగా

జాతీయస్థాయి గణిత శిబిరానికి ఎంపిక

నిజామాబాద్‌అర్బన్‌: గుజరాత్‌లో ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహించే గణిత శిక్షణ కార్యక్రమానికి జిల్లా గణిత టీచర్లు ఎంపిక య్యారు. గుజరాత్‌లోని ఐఐటీ గాంధీనగర్‌లో నిర్వహించే సెంటర్‌ ఫర్‌ క్రియేటివ్‌ లర్నింగ్‌ జాతీయస్థాయి గణిత శిక్షణ శిబిరానికి జిల్లా నుంచి పలువురు గణిత టీచర్లు ఎంపిక య్యారు. ఎంపికైన వారిలో మెంట్రాజ్‌పల్లి ఉపాధ్యాయుడు టి.కృష్ణ, మల్కాపూర్‌ ఉపాధ్యాయుడు ఆర్‌. గోపాలకృష్ణ, భీంగల్‌ ఉపాధ్యాయుడు కె.సతీశ్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..



కామారెడ్డి అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ఖోఖో అసోసియేషన్‌ ఆధ్వర్యంలో క్రీడాకారుల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11న యదాద్రి జిల్లా భువనగిరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్‌ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్‌ జిల్లా చైర్మన్‌ బిల్ల అనిల్‌, అధ్యక్షుడు భూమారెడ్డి, కార్యదర్శి మహ్మద్‌ అతికుల్లా తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రాజు, పరీక్షల కమిషనర్‌ నీలం లింగం, ప్రతినిధులు ఎస్‌.మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వరరావు, అస్మా, సంజీవులు, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీలో బంగారు పతకాలు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ నెల 7, 8 తేదీల్లో హన్మకొండలో కుస్తీపోటీలు నిర్వహించారు. మెన్‌ విభాగంలో వెంకటేశ్‌, ఉమెన్‌ విభాగంలో నేహాబేగం ఉత్తమ ప్రతిభకనబర్చి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కుస్తీ సంఘం కార్యదర్శి, కోచ్‌ సురేశ్‌ క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి, జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

పాఠశాల ఫర్నిచర్‌ ధ్వంసం



కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలపై విద్యార్థి సంఘాల నాయకులు గురువారం దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్కూల్‌లో 8, 9, 10వ తరగతులకు అనుమతులు లేవని ఎంఈవో గదులను సీజ్‌ చేసినా మరుసటి రోజునే సీజ్‌ను తొలగించి స్కూల్‌ను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే స్కూల్‌ యాజమాన్యంపై చీటింగ్‌ కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ, బీడీఎస్‌ఎఫ్‌, బీవీఎం, పీడీఎస్‌యూ సంఘాల నాయకులు సందీప్‌, అరుణ్‌, ఆజాద్‌, విఠల్‌, పెరుమాండ్ల బుల్లెట్‌, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

నంబర్‌ ప్లేట్‌లేని బైకులు సీజ్‌

జక్రాన్‌పల్లి: డిచ్‌పల్లి సీఐ మలేశ్‌ ఆధ్వర్యంలో జక్రాన్‌పల్లి ఎస్సై, సిబ్బంది నంబర్‌ ప్లేట్‌లేని వాహనాలపై గురువారం స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. తొమ్మిది ద్విచక్ర వాహనాలను సీజ్‌ చేసి, వాహనదారులకు కౌన్సెలింగ్‌ ఇచ్చినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఈసీ నామినీగా ప్రొఫెసర్‌ సిద్ధిఖీ

- తెయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం
- పలు తీర్మానాలకు ఆమోదం



తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీలను గాడిలో పెట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా అన్ని యూనివర్సిటీలకు కొత్త వీసీ (వైస్‌ ఛాన్సలర్‌)లను నియమించేందుకు జనవరి 27న నోటిఫికేషన్‌ జారీ చేసింది. అదే నెల 28 నుంచి ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరణ కొనసాగుతున్నది. సెర్చ్‌ కమిటీ వీసీల పేర్లను ప్రతిపాదించనున్న నేపథ్యంలో.. ప్రభుత్వం ముగ్గురితో సెర్చ్‌ కమిటీని నియమిస్తుంది. వీరిలో యూజీసీ నామినీ, రాష్ట్ర ప్రభుత్వ నామినీ, వర్సిటీ నామిని (ఈసీ నామినీ) ఉంటారు. తమకు అందిన దరఖాస్తులను సెర్చ్‌ కమిటీ పరిశీలించి ముగ్గురు అర్హుల పేర్లను ప్రభుత్వానికి పంపిస్తుంది. ముఖ్యమంత్రి ఆమోదంతో గవర్నర్‌కు పంపిస్తే.. అందులో ఒకరిని వీసీగా నియమిస్తారు. దరఖాస్తులకు గడువు దగ్గరపడటంతో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, వీసీలు, పాలకమండళ్ల (ఈసీ)తో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

తెలంగాణ యూనివర్సిటీ 63వ పాలకమండలి సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రస్తుతం తెయూ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరిస్తున్నారు. సమావేశంలో అజెండా అంశాలపై చర్చించి పలు తీర్మాణాలు చేశారు. ముఖ్యంగా తెయూ నామినీగా ప్రొఫెసర్‌ సులేమాన్‌ సిద్ధిఖీ పేరును ప్రతిపాదించి ఆమోదించారు. ఆయన తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో వర్సిటీ ఓఎస్‌డీగా విధులు నిర్వర్తించారు. సమావేశంలో రిజిస్ట్రార్‌ యాదగిరి, పాలకమండలి సభ్యులు నసీం, ప్రిన్సిపల్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆరతి, ర వీందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్‌, వసుంధరాదేవి, మారయ్యగౌడ్‌, ఎస్‌ఎల్‌ శాస్త్రి, ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

తీర్మానాలివీ..

- రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి పదవీ కాలాన్ని ఏడాదిపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పొడిగింపు.
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెయూ పరిధిలో మొదటి సారి డిగ్రీ, పీజీ విద్యార్థులకు డిటెన్షన్‌ విధానం అమలు.
- పరీక్షల విభాగం (ఈడీపీ)లో అమలు చేస్తున్న ఆన్‌లైన్‌ వాల్యుయేషన్‌ ఏజెన్సీకి వచ్చేసారి రెన్యువల్‌ చేయకుండా టెండర్లు పిలవడం.
- మెయిన్‌ క్యాంపస్‌లో సైన్స్‌బ్లాక్‌ నిర్మాణం కోసం మొదట రూ.12 కోట్ల నిధులతో ప్రతిపాదనలు ఉండగా, భవన నిర్మాణం పూర్తి చేయడానికి అదనంగా మరో రూ.6 కోట్లు వర్సిటీ అంతర్గత నిధులనుంచి మంజూరు.
- క్యాంపస్‌ హెల్త్‌ సెంటర్‌లో డాక్టర్‌ను నియమించడంతోపాటు నెలకు రూ.40వేలు వేతనం చెల్లింపు.
- వర్సిటీలో కంప్యూటర్స్‌ను టీఎస్‌టీఎస్‌ ద్వారా, ఇతర సామగ్రిని ప్రభుత్వ జైళ్ల శాఖ ద్వారా మాత్రమే కొనుగోలు చేయడం.
- కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజినీరింగ్‌ విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ భ్రమరాంబిక పదోన్నతిపై ఆమె పీహెచ్‌డీ పొందిన యూనివర్సిటీకి లేఖ రాయడం.
- పదవీ విరమణ పొందిన అసోసియేట్‌ ప్రొఫెసర్‌ జి.ప్రవీణాబాయికి పింఛన్‌ బెనిఫిట్స్‌ కోసం ప్రభుత్వానికి లేఖ.
- ప్రొఫెసర్‌ పి.కనకయ్యకు సీనియర్‌ ప్రొఫెసర్‌ పదవి కేటాయింపుపై హైకోర్టు ఇచ్చిన కోర్టు ధిక్కరణ ఉత్తర్వులపై హైకోర్టు డివిజన్‌ బెంచ్‌కు వెళ్లడం.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

- సీబీసీ ఫీల్డ్‌ పబ్లిసిటీ ఆఫీసర్‌ ధర్మానాయక్‌



మాట్లాడుతున్న ధర్మానాయక్‌

మోపాల్‌: కేంద్ర పథకాలను లబ్ధిదారులు వంద శాతం వినియోగించు కోవాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌ ధర్మానాయక్‌ సూచించారు. నగరశివారులోని బోర్గాం(పి), పాంగ్రాలో వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర-2 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వంద శాతం అందించాలనే లక్ష్యంతో వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. అర్హులై సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారు ఉండకూడదనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. క్యాలెండర్‌పై ఉన్న క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేస్తే కేంద్ర పథకాలపై అవగాహన వస్తుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ కేంద్ర పథకాలపై అవగాహన పెంపొందించుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్‌డీఎం నాగశ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. వివిధ వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి తీసుకువచ్చామన్నారు.అంతకుముందు స్థానికులతో వికసిత్‌ భారత్‌ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ సౌజన్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్లు, డాక్టర్లు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్యాస్‌ కనెక్షన్‌ వివరాలు త్వరగా నమోదు చేయాలి



యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో చందర్‌ నాయక్‌

రుద్రూర్‌: ప్రజాపాలన దరఖాస్తులలో సరిగా లేని గ్యాస్‌ ఏజెన్సీ, కనెక్షన్‌ నెంబర్‌ సరి చేసి సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని డీఆర్‌డీవో చందర్‌ నాయక్‌ ఆదేశించారు. రుద్రూర్‌ మండల పరిషత్‌ కార్యాలయంలో గ్యాస్‌ వివరాల నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. గ్యాస్‌ వివరాలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యదర్శుల సందేహాలను నివృత్తి చేశారు. ఎంపీడీవో బాల గంగాధర్‌, ఎంపీవో సాయిలు, కార్యదర్శులున్నారు.

ఆధార్‌, రేషన్‌కార్డులను అనుసంధానం చేయాలి

నందిపేట్‌(ఆర్మూర్‌): గృహజ్యోతి పథకానికి అర్హులైన విద్యుత్‌ వినియోగదారుల సర్వే నంబర్‌తో ఆధార్‌, రేషన్‌కార్డు వివరాలతో పాటు ఫోన్‌ నంబర్‌ను అనుసంధానం చేయాలని నిజామాబాద్‌ ట్రాన్స్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ ఎం.శ్రీనివాస్‌ ఆదేశించారు. నందిపేట 133/11 కేవీ సబ్‌డివిజన్‌ పరిధిలోని నందిపేట, నూత్‌పల్లి, మాక్లూర్‌, గొట్టుముక్కల సెక్షన్‌ గ్రామాలలో మీటరు రీడింగ్‌ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్తు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఏడీఈ అశోక్‌, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్స్‌

నిజామాబాద్‌ అర్బన్‌: జిల్లాలో ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో రఘురాజ్‌ తెలిపారు. జనరల్‌లో 2047 విద్యార్థులకు 1986 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 963 మందికి 869 మంది పరీక్ష రాశారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను డీఐఈవో పరిశీలించారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి టౌన్‌: జిల్లాలో ఇంటర్మీడియెట్‌ ప్రాక్టికల్స్‌ కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 644 విద్యార్థులకు గాను 627 హాజరుకాగా, 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 345 విద్యార్థులకు 333 మంది హాజరుకాగా, 12 మంది గైర్హాజర య్యారు. జిల్లా ఇంటర్మీడియెట్‌ అధికారి షేక్‌ సలాం ప్రాక్టికల్స్‌ను పర్యవేక్షించారు.

10న ఉర్దూ కవి సమ్మేళనం

దోమకొండ: మండలంలోని గడికోటలో ఈ నెల 10న ఉర్దూ కవి సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు గడికోట ట్రస్టు సీనియర్‌ మేనేజర్‌ బాబ్జీ గురువారం తెలిపారు. గతంలో సంస్థానాలను పాలించిన సంస్థానదీశుల సేవలపై, వివిధ రాష్ట్రాల ఉర్దూ కవులతో సమ్మేళనం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గడికోట సంస్థాన వారసుడు కామినేని అనిల్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనానికి కలెక్టర్‌ జితేశ్‌ వి పాటిల్‌, ఎస్పీ సింధుశర్మ, తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం చైర్మన్‌ మహమ్మద్‌ అబ్దుల్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ఉర్దూ కవులు, సాహితీ సేవకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్‌ సిబ్బందికి సహకరించాలి

నిజామాబాద్‌నాగారం: గృహజ్యోతి పథకం కోసం ప్రతి ఇంటికి వచ్చే విద్యుత్‌ సిబ్బందికి వినియోగదారులు వివరాలు అందించి సహకరించాలని ఎస్‌ఈ రవీందర్‌ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజాపాలన దరఖాస్తు రసీదు, రేషన్‌కార్డు, ఫోన్‌ నంబర్‌, ఆధార్‌కార్డు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తమ సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చినప్పుడు ఈ వివరాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సిబ్బంది వచ్చినప్పుడు వినియోగదారులు అందుబాటులో లేకుంటే దగ్గరలోని విద్యుత్‌ కార్యాలయాల్లో వివరాలు అందించాలని కోరారు.

ఎక్సైజ్‌ స్టేషన్‌ నుంచి ఒకరి పరారీ

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ఎక్సైజ్‌ కార్యాలయంలో విచారిస్తున్న ఓ వ్యక్తి పరారైనట్లు ఎక్సైజ్‌ సీఐ స్టీవెన్‌సన్‌ గురువారం తెలిపారు. ఈ నెల 6న గంజాయి సేవిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకొని కార్యాలయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో విచారిస్తుండగా పారిపోయినట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ తెలిపారు.

ఎస్‌బీలో బదిలీలు

సాక్షి ఎఫెక్ట్‌..

ఖలీల్‌వాడి: కమిషనరేట్‌ పరిధిలోని స్పెషల్‌ బ్రాంచ్‌ పోలీసుల బదిలీలు గురువారం జరిగాయి. జనవరి 31న 'ఎస్‌బీలో ఏళ్లుగా తిష్ట' శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి సీపీ కల్మేశ్వర్‌ స్పందించారు. ఎస్‌బీలో నాలుగేళ్ల నుంచి ఆరేళ్ల వరకు ఒకే చోట పనిచేస్తున్న వారిని బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



అసెంబ్లీకి..

అసెంబ్లీ బడ్జెట్‌ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆర్‌ భూపతిరెడ్డి, ధన్‌పాల్‌ సూర్యనారాయణ, వేముల ప్రశాంత్‌రెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, వెంకటరమణారెడ్డితోపాటు ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, మహేశ్‌కుమార్‌గౌడ్‌ హాజరయ్యారు.



క్రీడాకారులను ప్రోత్సహించాలి



విజేతలతో ఒలింపిక్‌, అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగరంలోని రాజారాం స్టేడియంలో గురువారం బహుమతులను ప్రదానం చేశారు. జిల్లా ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ను ఆక్స్‌ఫర్డ్‌ స్కూల్‌ సాధించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఒలింపిక్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య మాట్లాడుతూ.. ఆక్స్‌ఫర్డ్‌ స్కూల్‌ చిన్న విద్యా సంస్థ అయినప్పటికీ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ సాధించడం అభినందనీయమన్నారు. మిగతా ప్రైవేట్‌ పాఠశాలలు ఆక్స్‌ఫర్డ్‌ స్కూల్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని, క్రీడాకారులనుప్రోత్సహించాలన్నారు. అనంతరం అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో బొబ్బిలి నర్సయ్యను ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ఒలింపిక్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు వైఆర్‌ డేవిడ్‌, అథ్లెటిక్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షులు మార్టిన్‌, కపిల్‌, ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్‌, వ్యాయామ ఉపాధ్యాయులు, 200 మందికి పైగా అథ్లెట్లు పాల్గొన్నారు.

ఫేక్‌ డాక్యుమెంట్‌తో కండక్టర్‌ ఉద్యోగం

- రిటైర్డ్‌ అయిన ఉద్యోగి
- దర్యాప్తు చేపట్టిన ఆర్టీసీ అధికారులు

ఖలీల్‌వాడి: ఫేక్‌ డాక్యుమెంట్‌తో ఓ వ్యక్తి ఆర్టీసీలో కండక్టర్‌ ఉద్యోగం పొంది, రిటైర్డ్‌ అయ్యారు. ఈ ఘటన జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగర శివారులోని బోర్గాం(పి)కి చెందిన చంద్రశేఖర్‌ 1986లో కండక్టర్‌ ఉద్యోగాన్ని సెలక్షన్‌ కమిటీ ద్వారా పొందాడు. 32 ఏళ్ల ఆర్టీసీలో ఉద్యోగం చేశారు. నగరంలోని ఒకటో డిపోలో కండక్టర్‌గా పని చేసి, అంచెలంచెలుగా పదోన్నతి పొంది రిటైర్‌మెంట్‌ పొందారు. చంద్రశేఖర్‌ నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉద్యోగం సాధించాడని ఇటీవల కలెక్టర్‌కి ఫిర్యాదు అందింది. దీంతో కలెక్టర్‌ చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రిటైర్‌మెంట్‌ సమయంలో సైతం నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు తేలింది. దీంతో ఆర్టీసీ డిపో-1 డీఎం ఆనంద్‌ బుధవారం ఒకటో టౌన్‌లో చంద్రశేఖర్‌పై ఫిర్యాదు చేశారు. ఐపీసీ 406, 420, 468, 471 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వన్‌ టౌన్‌ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ప్రత్యేక బృందాలతో చంద్రశేఖర్‌ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై డిపో మేనేజర్‌ ఆనంద్‌ను వివరణ 2017లో చంద్రశేఖర్‌పై ఫిర్యాదు వచ్చిందని అప్పుడు కోర్టు నుంచి స్టే తీసుకున్నట్లు తెలిపారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఉద్యోగం పొందడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

అన్నను కాపాడబోయి తమ్ముడి గల్లంతు

- కాలువలో ముమ్మర గాలింపు
- ఒడ్డుకు చేరుకున్న అన్న

మోర్తాడ్‌: కాలువలో పడ్డ అన్నను కాపాడబోయి తమ్ముడు గల్లంతయిన ఘటన కాకతీయ కాలువలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన లక్ష్మీనారాయణ తన ఇద్దరు కుమారులు గౌతం, గణేశ్‌తో కలిసి ఏర్గట్ల శివారులోని కాకతీయ కాలువ సమీపంలో ఈతకల్లు సేవించడానికి గురువారం వెళ్లా రు. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో గౌతం కాలువలోకి దిగాడు. దీంతో అన్నని రక్షించేందుకు తమ్ముడు గణేశ్‌ కాలువలోకి దిగి రక్షించేందుందుకు ప్రయత్నించాడు.

గౌతం ఎలాగోలా ఒడ్డుకు చేరుకున్నాడు. గణేశ్‌ మాత్రం రెప్పపాటులో కాలువ ప్రవాహవేగానికి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్ల కాలువలో గా లింపు చర్యలు చేపడుతున్నారు. గణేశ్‌ గల్లంతు కావడంపై కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

అర్గుల్‌లో విద్యార్థి కిడ్నాప్‌యత్నం

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో విద్యార్థి కిడ్నాప్‌యత్నం కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగరాజు అనే 8వ తరగతి విద్యార్థి ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఓమ్ని వాహనాన్ని ఆపి ఆడవేషంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు చాక్లెట్లు ఇస్తామని నాగరాజును పిలిచారు. వారు విద్యార్థి నాగరాజుతో మాట్లాడానికి ప్రయత్నించారు. దీంతో విద్యార్థి భయపడి వెంటనే పాఠశాలకు వెళ్లి జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపాడు. నాగరాజును కిడ్నాప్‌ చేయడానికి దుండగులు వచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు.

ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా నాగరాజును ఎవరైనా వివరాలు అడిగి ఉంటారేమోనని అనుమానిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి సీసీపుటేజ్‌లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్‌

కాలువలో పడి ఒకరి మృతి

మోర్తాడ్‌: ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన చేపూరి నారాయణ(66) కాకతీయ కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. కాలువలో బట్టలు ఉతికేందుకు వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారిపడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య

రామారెడ్డి: స్కూల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్‌ తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన గోసంగి భారతి(15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఉదయం తల్లితండ్రులు కూలీ పనులు వెళ్లేటప్పుడు స్కూలుకు వెళ్లాలని మందలించారు. దీంతో విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం తల్లితండ్రులు ఇంటికి వచ్చేసరికి కూతురు విగతజీవిగా కనిపించడంతో వారి రోదనలు మిన్నంటాయి. భారతి తండ్రి సాంబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: పట్టణ కేంద్రంలోని ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. కూలీ పని చేసుకుంటూ జీవించే సదరు వివాహిత ఈ నెల 3న రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



రెంజల్‌: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్‌ తెలిపారు. మండలంలోని పేపర్‌మిల్‌ నుంచి తాడ్‌బిలోలి మీదుగా నిర్మల్‌ జిల్లాకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాలను స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసి జిల్లా జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక, మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఫకీరాబాద్‌లో మరో టిప్పర్‌..



నవీపేట: మండలంలోని ఫకీరాబాద్‌ శివారులో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ గురువారం తెలిపారు. రెంజల్‌ మడలంలోని సాటాపూర్‌ నుంచి ఫకీరాబాద్‌ మీదుగా కొన్ని రోజులుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం టిప్పర్‌ను సీజ్‌ చేసి స్టేషన్‌కు తరలించామని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మిట్టాపల్లిలో అనుమానితుల పట్టివేత

డిచ్‌పల్లి: ఊరూరు తిరుగుతూ భిక్షాటన చేసే యాచకులను పిల్లలను ఎత్తుకెళ్లే వారిగా అనుమానించిన గ్రామస్తులు వారిని బంధించి పోలీసులకు పట్టించిన ఘటన మండలంలోని మిట్టాపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన షేక్‌ హమీద్‌ తన కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు, ఇద్దరు పిల్లలతో కలిసి గురువారం మిట్టాపల్లికి వచ్చాడు. హమీద్‌ గ్యాస్‌ స్టవ్‌లు రిపేర్‌ చేస్తుంటాడు. మహిళలు పిల్లలతో కలిసి భిక్షాటన చేస్తుంటారు. ఇటీవల జిల్లాలో వరుసగా పిల్లల కిడ్నాప్‌ ఉదంతాలు చోటు చేసుకున్న నేపథ్యంలో గ్రామంలో అపరిచితులు కనిపించడంతో పిల్లలను ఎత్తుకెళ్లే వారిగా అనుమానించిన గ్రామస్తులు వారిని బంధించి పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్న ఎస్సై వారిని పీఎస్‌కు తరలించి విచారణ చేపట్టారు. తాము కామారెడ్డికి చెందిన వారిమని, భిక్షాటన చేసుకుంటూ బతుకుతామని చెప్పడంతో తహసీల్దార్‌ రాజేందర్‌ ఎదుట బైండోవర్‌ చేసి సొంత పూచీకత్తుపై పంపించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్‌: మండలంలోని గుత్ప శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు గురువారం తెలిపారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 18వేల నగదు, 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సదాశివనగర్‌: మండలంలోని మోడెగాం గ్రామానికి చెందిన ఒకరికి డ్రంకన్‌ డ్రైవ్‌లో రెండో తరగతి జ్యుడీషియల్‌ మెజిస్ట్రేట్‌ ప్రతాప్‌ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీలో మద్యం తాగి వాహనం నడిపినందున జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.